
సాక్షి బాపట్ల

గురువారం। 20। మార్చి। 2025



నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి బుధవారం గుంటూరు గోరంట్లకు చెందిన వాసా భాస్కరరావు రూ.లక్ష విరాళం సమర్పించారు.



సాగర్ నీటి మట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 518.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పొగాకు బోర్డు ఈడీగా విశ్వశ్రీ



కొరిటెపాడు : భారత పొగాకు బోర్డు నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జి.విశ్వశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది, పలువురు వ్యాపారులు, రైతులు ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
బాపట్ల	6.24	4.55
నరసరావుపేట	6.26	4.57
గుంటూరు	6.24	4.55

న్యూస్‌రీల్

శింగరకొండలో పుల్లెల గోపీచంద్ పూజలు



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ కుటుంబ సమేతంగా బుధవారం రాత్రి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేసి, వారిని ఆశీర్వదించారు.

పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ పీడీ బాధ్యతలు స్వీకరణ



నరసరావుపేట: పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ పీడీగా ఝాన్సీరాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఒంగోలు జిల్లాలో విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన బాలూనాయక్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల మేరకు ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.

గేట్‌లో జశ్వంత్ భవానీకి 6వ ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్–2025 పరీక్షా ఫలితాలలో పట్టణానికి చెందిన పెంటేల జశ్వంత్ భవాని 6వ ర్యాంక్ సాధించాడు. జశ్వంత్ భవాని తండ్రి రాజశేఖర్ న్యాయవాదిగా పని చేస్తున్నారు. ముంబైలో 5జీ సిస్టమ్ ఇంజినీర్‌గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి గేట్ పరీక్షలకు జశ్వంత్ సిద్ధం అయ్యాడు. అందరి అంచనాలను నిజం చేస్తూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించాడు. దేశవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మందికి పైగా పరీక్ష రాశారు. ఇందులో దాదాపు లక్ష మంది అభ్యర్థులు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో పరీక్ష రాశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జశ్వంత్ భవాని 6వ ర్యాంక్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని పలువురు అభినందనలు తెలియజేశారు.

1,27,005 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 1,27,005 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,24,077 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 – రూ.14,500 వరకు పలికింది.

ఆరోగ్య మిత్రల మెడపై కత్తి!

- ఆరోగ్యశ్రీని బీమా కంపెనీకి అప్పగించేందుకు పాలకుల కుట్ర
- కూటమి సర్కారు దెబ్బకు సర్వీసుకు ఎసరు
- 15 ఏళ్లకుపైగా విధుల్లో ఉన్న ఆరోగ్య మిత్రలు
- కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్
- 24 వరకు సమ్మెలోనే కొనసాగనున్న ఉద్యోగులు
- సేవలు అందక తీవ్ర అవస్థలు పడుతున్న రోగులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆరోగ్య మిత్రలు

బాపట్ల టౌన్ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేసే ఆరోగ్య మిత్రల్లో ఆందోళన నెలకొంది. ఉద్యోగం ఉంటుందో.. ఊడుతుందో తెలియక సతమతం అవుతున్నారు. ఆరోగ్యశ్రీ స్థానంలో బీమా కంపెనీ ద్వారా సేవలు అందిస్తామని కూటమి సర్కార్ చెబుతోంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇలా చేయడానికి ఏర్పాట్లు చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీమా కంపెనీ వస్తే ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు, టీమ్ లీడర్లు, ఆఫీస్ సిబ్బందిని కొనసాగిస్తారా...లేదా.. అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఈ నెల 10వ తేదీ నుంచి వారందరూ విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 12న వారిని చర్చలకు పిలిచారు. చర్చలు విఫలం కావడంతో 17 నుంచి 24వ తేదీ వరకు విధులు బహిష్కరించి శాంతియుత నిరసనకు దిగారు.

సీఎఫ్ఎంఎస్‌తో ఉద్యోగ భద్రత

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేసిన ఉద్యోగులను ఆప్కాస్ (ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్) కిందకు చేర్చారు. వారికి సీఎఫ్ఎంఎస్ ఐడీ ద్వారా ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు ఇచ్చారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించారు. సీఎఫ్ఎంఎస్ వేతనం తీసుకోవడంతో తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందన్న ఆశతో ఇన్నాళ్లుగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవను ప్రైవేటు బీమా కంపెనీకి అప్పగించే కుట్ర జరుగుతుండటంతో ఉద్యోగ భద్రతపై వైద్య మిత్రలు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో 20 నెట్‌వర్క్ వైద్యశాలలు

జిల్లాలోని 20 నెట్‌వర్క్ వైద్యశాలల్లో 33 మంది ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారు. వీటిల్లో రెండు ఏరియా వైద్యశాలలు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పది ప్రైవేట్ వైద్యశాలలు ఉన్నాయి. వాటిల్లో చీరాలలో ఆరు, అద్దంకిలో మూడు, బాపట్లలో రెండు, రేపల్లెలో రెండు ఉన్నాయి. వేమూరులో, నగరంలో, పిట్టలవానిపాలెంలో, నిజాంపట్నంలో, చెరుకుపల్లిలో, మార్టూరులో, పర్చూరులో ఒకటి చొప్పున ఉన్నాయి.

15 సంవత్సరాలుగా సేవలు

రోగులు వైద్యశాలల్లో చేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకునే వరకు వైద్య మిత్రలు పర్యవేక్షిస్తుంటారు. పేద రోగులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తుంటారు. ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఆరోగ్యరక్ష స్కీముకు సంబంధించి వివరాలు తెలియజేస్తుంటారు. ఇలా అన్ని విభాగాల్లో 15 ఏళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వయసు కూడా చాలా మందికి 50 ఏళ్లు దాటింది. ఆరోగ్యశ్రీ ప్రైవేటు బీమా కంపెనీ చేతుల్లోకి వెళితే ఎవర్ని తొలగిస్తారోనని ఆందోళనగా ఉందని, ఈ వయసులో వేరే ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాలకు వెయిటేజ్ ఇవ్వాలని, చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గ్రాట్యూటీ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

జీఓ నెం.28 రద్దు చేయాలి



ఈ ఉద్యోగాన్ని నమ్ముకుని చాలా మంది కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అనేక ఒడిదొడుకుల మధ్య ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కంపెనీలో చేరుస్తారని చెబుతున్నారు. దీంతో చాలా మంది ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ఆరోగ్య మిత్రలకు న్యాయం చేయాలి. ప్రధానంగా జీతభత్యాలు పెంచాలి. 28 జీఓను రద్దు చేయాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నదే మా ముఖ్యమైన డిమాండ్.

– బడుగు రాజు, ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

సమస్యలు పరిష్కరించాలి



ఏళ్ల తరబడి ఎన్నో ఒత్తిళ్లను తట్టుకొని పేదలకు సేవ చేస్తున్నాం. మాలాంటి వారిని ఇబ్బందులకు గురి చేసేలా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదు. మా న్యాయమైన సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలి. ఈ విషయాలపై ఈ నెల 12న ఉన్నతాధికారులతో జరిగిన చర్చలు ఫలించలేదు. ప్రస్తుతం తెరపైకి వస్తున్న కొన్ని ఊహాగానాలతో అసలు మా ఉద్యోగాలు ఉంటాయో...ఉండవోనన్న ఆందోళన మా అందరిలో మొదలైంది.

– జి. పాప, ఆరోగ్య మిత్ర

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

బాపట్ల టౌన్: మహిళను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ బుధవారం బాపట్ల జిల్లా 6వ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి కె. శ్యాంబాబు తీర్పు వెలువరించారు. కృష్ణా జిల్లా మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన బోల్లిపోగు రాణి 2012లో గుంటూరులోని చైతన్య కళాశాలలో కేర్ టేకర్‌గా చేరింది. అక్కడే గారపాటి రాజశేఖర్ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా ఉన్నాడు. వీరి పరిచయం ప్రేమగా మారింది. 2013లో సంక్రాంతి పండుగ తర్వాత ఆమె గుంటూరులోని వికాస్ నగర్‌లోని ఎన్ఆర్ఐ కళాశాలలో స్టూడెంట్స్ ఇన్‌చార్జ్‌గా చేరింది. రాజశేఖర్ చైతన్య కళాశాలలోనే పనిచేస్తు ఉండేవాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవడానికి రాజశేఖర్ తిరస్కరించాడు. అప్పటినుంచి వేర్వేరుగా ఉంటున్నారు. 2013 మార్చి 22న ఆమెను ఒప్పించి బాపట్ల మండలంలోని సూర్యలంక తీరానికి రాజశేఖర్ తీసుకొచ్చాడు. తర్వాత పదునైన ఆయుధంతో ఆమెను పొడిచి చంపాడు. ఈ కేసులో బుధవారం తీర్పు వెలువడింది. నిందితుడు గారపాటి రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె. శ్యాంబాబు తీర్పు ఇచ్చారు. అనంతరం పోలీసులు నిందితుడిని బాపట్ల జైలుకు తరలించారు. కేసులో సాక్ష్యాలు సక్రమంగా అంది నిందితుడికి శిక్షపడేలా చేసిన సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు.

మందులతో క్షయ నివారణ

తెనాలిఅర్బన్: మందులు సకాలంలో వాడితే క్షయను పూర్తిగా నివారించవచ్చని టీబీ విభాగ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ పేర్కొన్నారు. తెనాలి పట్టణ పరిధిలోని రోగుల ఇళ్లకు బుధవారం ఆయన వెళ్ళి వారికి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే వారు వాడే మందుల వివరాలు సక్రమంగా రికార్డు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ నాయకులను వేధిస్తున్న ప్రభుత్వం

మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డి



మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి

చిలకలూరిపేట: రాజకీయ అరాచకాలకు పరాకాష్ట కూటమి ప్రభుత్వ పాలన అని... న్యాయ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని మాజీ అదనపు అడ్వకేట్ జనరల్, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకరరెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి పరిపాలనపై, పేదలపై ప్రేమ లేదని, కేవలం రాజ్య హింసను మాత్రమే ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా యాక్టివిస్టు దొడ్డా రాకేష్‌గాంధీ కేసు విచారణ నిమిత్తం చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బుధవారం ఆయన హాజరయ్యారు. మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం, ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యాన్ని విడిచిపెట్టి ప్రభుత్వం కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించడంలో పురోగతి సాధించిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోరితే రాష్ట్ర డీజీపీ అపాయింట్‌మెంట్ ఇవ్వరని, టీడీపీ వారు పెట్టిన పోస్టులపై ఫిర్యాదు చేస్తే ఏ మాత్రం కేసులు నమోదు చేయరని ఆరోపించారు. అదే టీడీపీకి చెందిన వారు ఫిర్యాదు చేయడం ఆలస్యం, ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు రాష్ట్రం నలుమూలల కేసులు నమోదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న అరాచక వైఖరిని మర్చిపోమని, చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న పోలీసు అధికారులను న్యాయ స్థానాల ముందు నిలబెట్టి తీరుతామని హెచ్చరించారు. జర్మనీలో హిట్లర్ పరిపాలన కాలంలో ముందుగా యూదులను వేధించారని, తమను కాదని కమ్యూనిస్టులు మౌనంగా ఉన్నారన్నారు. అనంతరం కమ్యూనిస్టులను, సోషలిస్టులను కూడా వేధించారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్న ప్రభుత్వం తదుపరి సమస్యలపై ప్రశ్నించే ప్రతి గొంతుకను వేధించటం ఖాయమన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని తెలిపారు.

అన్నీ తప్పుడు కేసులే !

ప్రస్తుతం కేసులు బనాయించి వేధిస్తున్న దొడ్డా రాకేష్ గాంధీ కేసులో పేర్కొన్న ఆరో తేదీ రాత్రి 9గంటలకు గుంటూరులోని శ్యామలానగర్‌లో ఉన్నట్లు సీసీ టీవీ ఫుటేజీలు ఉన్నాయని, అవి న్యాయస్థానంలో అందజేశామని తెలిపారు. ఇదే కేసులో ముద్దాయిగా ఉన్న ఫణీంద్ర అదే సమయంలో గుంటూరులోని ఓ సెలూన్‌లో ఉండగా, మరో ముద్దాయి రామకోటేశ్వరరావు హైదరాబాద్‌లో ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని వివరించారు. ఇలాంటి తప్పుడు కేసుల్లో పోలీసుల తరుపున డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ స్థాయి న్యాయాధికారి హాజరుకావడం వెనుక ప్రభుత్వ ఉద్దేశాలు వేరే ఉన్నాయని సుధాకరరెడ్డి పేర్కొన్నారు. రాకేష్‌గాంధీని కస్టడీకి తీసుకొని తమకు అనుకూలంగా వాంగ్మూలం ఇప్పించుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. భారతదేశంలో పోలీసుల ముందు ఇచ్చిన వాగ్మూలానికి చట్టబద్ధత ఉండదని తెలిపారు. బీసీ మహిళ అయిన మాజీ మంత్రి విడదల రజినీని కేసులో ఇరికించి వేధించేందుకే పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను న్యాయపరంగా ఆదుకొనేందుకు, అరాచకాలను అడ్డుకొనేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

సుదీర్ఘ వాదనలు

రాకేష్‌గాంధీకి బెయిల్ మంజూరు చేయాలని మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. అతనిని పోలీసు కస్టడీకి అప్పగించాలని డీడీపీపీ బర్కత్ అలీఖాన్ పోలీసుల తరుపున వాదించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి గురువారం ఆర్డర్లు జారీ చేస్తామని వెల్లడించారు.

రుణాల పంపిణీలో లక్ష్యాలు సాధించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: జిల్లాలోని రైతులకు బ్యాంకర్లు అధిక రుణ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రాధాన్యతా రంగాలు, ప్రాధాన్యత లేని రంగాలకు రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు నూరు శాతం చేరుకోవాలని సూచించారు. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున నిరుపేదల జీవనోపాధి పెంచడానికి రుణ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని ఆయన సూచించారు. నిరుపేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా రుణ పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్, చేనేతలకు ముద్ర రుణాలు, అన్ని విభాగాల కార్పొరేషన్ రుణాలు, కిసాన్ డ్రోన్స్, ఎస్ఎల్ఎం పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలని సూచించారు. గేదెల బీమా కోసం పశుబీమా పథకం అమలుపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఉత్పత్తి రంగాల అభివృద్ధికి అధిక రుణాలు ఇవ్వాలని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.10,054 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, డిసెంబర్ 31వ తేదీ నాటికి రూ.9,321 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు రూ.1,154 కోట్లకుగాను రూ.862 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.514 కోట్లకుగాను రూ.168 కోట్లు పంపిణీ చేశామని గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.13,444 కోట్ల రుణాలు పంపిణీ చేయాలని బ్యాంకర్లకు లక్ష్యాలు నిర్దేశించగా 93.50 శాతానికి చేరినట్లు వివరించారు. గడిచిన రెండు నెలలు, రానున్న 20 రోజుల్లో నూరు శాతం లక్ష్యాలు చేరుకోవాలని తెలిపారు. కౌలు రైతులకు రూ.100 కోట్లు రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం 1.89 లక్షల మంది కౌలు రైతులకు కార్డులు జారీ చేశామన్నారు. వారికి ప్రస్తుతం రూ.55 కోట్లు రుణం ఇవ్వగా, పంట రుణాలు అందించాలని సూచించారు. 7,900 చేనేత కుటుంబాలకు రుణ సదుపాయం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పొదుపు మహిళా సంఘాలకు లక్ష్యం మేరకు రుణ సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. ముద్ర రుణాల మంజూరులో ప్రస్తుతం 44.40 శాతం లక్ష్యం కాగా, నూరు శాతం చేరుకోవాలని సూచనలు చేశారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎల్డీఓ అభిషేక్, నాబార్డ్ డీడీఎం రవికుమార్, ఎల్‌డీఎం శివకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌కు రూ.149 కోట్లు

బాపట్ల: జలజీవన్ మిషన్ జిల్లాకు రూ.149 కోట్ల నిధులు మంజూరయ్యాయని, 337 పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వాటర్, శానిటేషన్ మిషన్ జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. జిల్లాలోని సమగ్ర నీటి సరఫరా పథకాలను, తాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని పేర్కొన్నారు. తాగునీటి పథకాలను మరమ్మతులు చేయడానికి జిల్లా పరిషత్ 15 ఆర్థిక సంఘం నిధుల విషయం గురించి అడిగారు. తాగునీటి పథకాలకు బోర్ల మరమ్మతులకు గ్రామస్థాయిలో పంచాయతీలకు మంజూరైన నిధులు ఎంతనే విషయాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్లను మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలో మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ అనంత రాజు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధా మాధవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, గుంటూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఇఓ కృష్ణ, ప్రకాశం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఇఓ బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత




సునీల్‌కుమార్‌కు నియామకపత్రం అందిస్తున్న జె.వెంకట మురళి

బాపట్ల: ఓ నిరుపేద కుటుంబానికి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చేయూత అందించారు. కర్లపాలెం మండలం పేరళి గ్రామానికి చెందిన దోమతోటి సందీప్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కొంతకాలం క్రితం స్తంభంపై విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కుటుంబం వీధిన పడింది. సందీప్ తల్లి కలెక్టర్‌కు దీనిపై వినతిపత్రం అందజేశారు. సందీప్ సోదరుడు సునీల్ కుమార్‌కు పొరుగు సేవల పద్ధతిలో ఉద్యోగం కల్పించి ఆ కుటుంబానికి దారి చూపారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో కమాటీగా అతడిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. నియామక ఉత్తర్వులను కలెక్టర్ స్వయంగా సునీల్ కుమార్‌కు అందజేశారు. జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె. రాజదిబోరా తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

- పని ఒత్తిడే కారణమంటూ సూసైడ్ నోట్
- నాలుగు నెలల క్రితమే వివాహం



నరసరావుపేట టౌన్: తీవ్ర పని ఒత్తిడితో ఉద్యోగం చేయలేక పోతున్నా.. వద్దు అంటే పెళ్లి చేశారు.. ఇప్పుడు ఉద్యోగం మానేస్తే భార్య తరపు బంధువుల నుంచి మాట వస్తుంది.. ఒత్తిడి తట్టుకోలేక లోకం విడిచి వెళ్తున్నా..అమ్మా నాన్న నన్ను క్షమించండి ! అంటూ నాలుగు నెలల క్రితం వివాహం అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గుడిపాడుకు చెందిన బండ్ల హనుమంతరావు (29) కు నరసరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో నాలుగు నెలల కిందట వివాహం అయ్యింది. హనుమంతరావు రెండేళ్ల నుంచి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. పని ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల సెలవుపై వచ్చి స్వగ్రామంలో ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పెద్దలు అతనికి నచ్చ చెప్పారు. కొన్ని రోజులు బాగానే ఉండి రెండ్రోజుల కిందట భార్యను పుట్టింట్లో వదిలి నరసరావుపేట బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. సోమవారం నుంచి అతను బయటకు రాకపోవడాన్ని గమనించిన లాడ్జి సిబ్బంది మంగళవారం రాత్రి తలుపు బద్దలకొట్టి చూడగా ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ సీహెచ్ విజయ్ చరణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ఆత్మహత్యకు వివిధ మార్గాల్లో ప్రయత్నం

బండ్ల హనుమంతరావు ఎలాగైనా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న తర్వాత పలు రకాలుగా ప్రయత్నం చేసి విఫలమై చివరకు ఉరివేసుకొని మృతి చెందినట్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు భావిస్తున్నారు. కత్తితో మెడ కోసుకునేందుకు మొదట ప్రయత్నం చేశాడు. మృతుడి మెడ భాగంలో ఉన్న గాట్లను పరిశీలించిన పోలీసులు అక్కడ ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు.

పురుగు మందు తాగిన భార్య

భర్త ఆత్మహత్య విషయం తెలుసుకున్న భార్య క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్స కొనసాగుతోందని వైద్యులు వెల్లడించారు.

ఉద్యోగోన్నతి వచ్చినా జీతం రాదట..!

తప్పుల తడకగా ఏఎన్ఎంల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: ఉద్యోగోన్నతి వచ్చినా జీతం రాదని తెలిసి పలువురు ఏఎన్ఎంలు లబోదిబోమంటున్నారు. అధికారులు చేసిన తప్పులకు తాము బలి అవుతున్నామని విలపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 266 గ్రేడ్–3 ఏఎన్ఎంలకు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్‌గా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ కౌన్సెలింగ్‌లో 15 మంది ఏఎన్ఎంలకు పొజిషన్ ఐడీ లేని ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొన్ని ప్రాంతాల్లో శాంక్షన్ పోస్టు ఉన్నా.. పొజిషన్ ఐడీ లేకపోతే జీతం రాదు. ఈ విషయాన్ని కౌన్సెలింగ్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గమనించలేదు. ఖాళీల ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేసినప్పుడు వాటిలో పొజిషన్ ఐడీలేని ప్రదేశాలు తీసివేసి, శాలరీ వచ్చే ప్రదేశాలు మాత్రమే చూపించాల్సి ఉంది. అయితే అవేవీ అధికారులు పట్టించుకోలేదు. పొజిషన్ ఐడీ లేని ప్రాంతాల్లోనూ పోస్టింగ్ ఇచ్చారు. ఈ ఉత్తర్వులు తీసుకుని కొత్త హోదాలో విధుల్లో చేరేందుకు కోటి ఆశలతో వెళ్లిన ఏఎన్ఎంలకు అక్కడి సిబ్బంది ఈ విషయం చెప్పారు. దీంతో లబోదిబోమంటూ 15 మంది ఏఎన్ఎంలు తిరిగి డీఎంహెచ్ఓ కార్యాలయానికి వచ్చారు. మరోమారు కౌన్సెలింగ్ నిర్వహిస్తామనడంతో ఏఎన్ఎంలు ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బాపట్ల: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. యూనియన్ ముఖ్యనాయకుల సమావేశం స్థానిక కోన భవన్‌లో బుధవారం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఖాళీలకు ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరాజు, వి.పూర్ణచంద్రరావు, ఎ.రాంమోహన్‌రావు, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు బహుమతులు



బాపట్ల: ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2025 పోటీల్లో బాపట్ల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారని కోచ్ యర్ర నాగేశ్వరరావు పేర్కొన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ బుధవారం జరిగింది. యర్ర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ మచిలీపట్నంలో జరిగిన పోటీల్లో బాపట్ల నుంచి జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్‌ను పి.యశస్విన్, పి.రామ్ వరణ్య, సోనూ నాగసాయి, సిల్వర్ మెడల్‌ను సీహెచ్ జయంతిబాబు, బ్రాంజ్ మెడల్లను వైష్ణవ్, కె. పర్ణిక సాయి గెలుచుకున్నారని తెలిపారు. గూడవల్లికి చెందిన గోల్డ్ నగలు ఎం. కార్తీక్, పి. బాలాజీ, సీహెచ్ కీర్తన, ఎ. నిత్య, హరి చరిత, గగన, ప్రశంస, అయేషా, కిషోర్, సిల్వర్ మెడల్స్‌ను పి. ఖుషి, సీహెచ్ ధన్య, ఎ. సోహిత, దీక్షిత, కీర్తన. బ్రాంజ్ మెడల్లను కె.జయంతి, జె. సాన్విత గెలుచుకున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్లో టీం మేనేజర్లు వ్యవహరించిన అవినాష్, కరాటేలో బహుమతులు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

క్వారీ గుంతలో పడి బాలుడు మృతి



కర్లపాలెం: అక్రమ సంపాదనే ధ్యేయంగా టీడీపీ చోటా నాయకులు అనధికారికంగా ఇసుక క్వారీ తవ్వి విక్రయించుకున్నారు. కానీ దానిని పూడ్చకుండా వదిలేయడంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి రెవెన్యూ పరిధిలో బుధవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు యాజలి ఎస్సీ కాలనీకి చెందిన ఉన్నం కిషోర్ – అమృతమ్మల కుమారుడు ప్రవీణ్‌కుమార్(14) తన స్నేహితులతో కలిసి బుధవారం క్వారీ వద్దకు వెళ్లాడు. తర్వాత నీటిలో మునిగి మృతి చెందాడు. తోటి బాలురు వచ్చి విషయం తెలపటంతో గ్రామస్తులు గాలించారు. ప్రవీణ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. కన్నవారు విలపిస్తున్న తీరు స్థానికులను కూడా కంటతడి పెట్టించింది. అనధికారిక ఇసుక క్వారీని తహసీల్దార్ సుందరమ్మ, ఎస్‌ఐ రవీంద్ర పరిశీలించారు. బాలుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం



బాపట్ల: కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర అభినందనీయమని, వారి సహాయ సహకారాలు ప్రస్తుత విద్యార్థులకు ప్రేరణనిస్తాయని ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మి దేవి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో నూతనంగా నిర్మించిన ఆలుమ్ని హౌస్ మొదటి అంతస్తును బుధవారం ప్రారంభించారు. డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించబడిన ఈ వసతి గృహం అతిథులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూనరాణి కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ జి. కరుణాసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 10న పురుగుల మందు తాగిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు, మృతుని బంధువుల కథనం ప్రకారం.. తాడేపల్లికి చెందిన కిశోర్(32) మద్యానికి బానిసయ్యాడు. భార్య నాగేశ్వరితో తరచూ గొడవలు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో నాగేశ్వరి తల్లి, సోదరుడు వచ్చి మాట్లాడారు. ఈ సందర్భంలో కిశోర్‌కు, వారికి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నాగేశ్వరి తల్లి, సోదరుడు కిశోర్ కళ్లలో కారం కొట్టి దాడి చేశారు. మనస్తాపం చెందిన కిశోర్ ఈనెల 10న పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. అయితే భార్య, అత్త, బావమరిది వల్లే తన కొడుకు మరణించాడని కిశోర్ తల్లి బుజ్జి ఆరోపిస్తున్నారు. పెళ్లికి ముందు కిశోర్‌కు వ్యసనాలు లేవని, ఇంటర్నెట్‌లో పనిచేసేవాడని, ఇటీవల ఆ ఉద్యోగం మానివేయడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని బుజ్జి వివరించారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని, సర్దిచెప్పాల్సిన అత్త, బావమరిది కళ్లలో కారం కొట్టి దాడి చేశారని, అందుకే తన కొడుకు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని, అయినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదని విమర్శించారు.

మిర్చికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్



మిరప కాయలను పరిశీలిస్తున్న జమలయ్య

సంతమాగులూరు (అద్దంకి): ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర రూ.21 వేలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు అడ్డరోడ్డు , ఏల్చూరు, కొమ్మాలపాడు గ్రామాల్లోని మిర్చి చేలను పరిశీలించారు. కల్లాల్లోని మిరపకాయలను చూసి, రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఒక ఎకరంలో సాగుకు రూ.2.52 లక్షలు వ్యయం అయిందని రైతులు సీహెచ్ హనుమంతరావు, ఎ. నాగేశ్వరరావు, రామకృష్ణ, ఎస్‌కే ఖాదర్ చెప్పారు. ఎంతో శ్రమించి పండించినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా ధర మాత్రం క్వింటాకు రూ.10 వేలలోపే ఉందని వాపోయారు. జమలయ్య మాట్లాడుతూ క్వింటాకి రూ.21 వేలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.11,781గా ప్రకటించడం దుర్మార్గమన్నారు. మూడు నెలల నుంచి కాలయాపన చేసి క్వింటా మిర్చి కూడా కొనుగోలు చేయలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం సుమారు ఐదు లక్షల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారని చెప్పారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై చోద్యం చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఒకవైపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. వారికి ఏదో మేలు చేయబోతున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బడ్జెట్ సమావేశాల సందర్భంగా మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందని రైతులు పేర్కొన్నారు. ధరల వ్యత్యాస పథకం కింద ఆదుకుంటామని చెప్పి ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నేరుగా రైతుల నుంచి మిర్చిని క్వింటా రూ.21 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైన ప్రాంతాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సీపీఐ కార్యదర్శి సింగరకొండ, వ్యయసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, కౌలు రైతుల సంఘం నాయకులు ఎస్‌కే ఖాదర్ బాషా, చెన్నుబోయిన హనమంతరావు, రామకృష్ణ, మేకల రమణయ్య, ఆవుల యలమందయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీ



చోరీకి గురైన ట్రాక్టర్ (ఫైల్)

కారంచేడు: వ్యవసాయ పనుల నిమిత్తం కాలువ కట్ట వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఉదయం కాలువ కట్ట వద్దకు వచ్చిన చూసిన రైతు అక్కడ ట్రాక్టర్ లేకపోవడంతో అవాక్కయ్యారు. కొద్దిసేపు చుట్టు పక్కల విచారించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పోతినవారిపాలెం గ్రామానికి చెందిన రైతు పోతిన బాలకృష్ణ ఎప్పటి మాదిరిగానే తన వ్యవసాయ పొలానికి ట్రాక్టర్ ఇంజిన్ సాయంతో నీటిని పంపింగ్ చేస్తున్నారు. రెండు రోజుల నుంచి కాలువ కట్ట వద్దనే ట్రాక్టర్ ఉంది. మంగళవారం రాత్రి పంపింగ్ అనంతరం ఇంజిన్ ఆపి ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం చూస్తే ట్రాక్టర్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి. వెంకట్రావు తెలిపారు.

డీ అడిక్షన్ సెంటర్ పరిశీలన

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): మద్యానికి బానిసైన వారికి డీ అడిక్షన్ సెంటర్లో కౌన్సెలింగ్ ఇచ్చి మద్యపానానికి దూరం చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ డాక్టర్లకు సూచించారు. బుధవారం గుంటూరు జీజీహెచ్‌లోని డీ అడిక్షన్ సెంటర్, గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలోని లేబొరేటరీని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మద్యానికి బానిసైన వారికి క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి, ఏఈఎస్ మారయ్య బాబు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

మరో నలుగురికి గాయాలు



ప్రమాదంలో మరణించిన షేక్ అషీర్ బీ

జె.పంగులూరు: కూలీల ఆటో జాతీయ రహదారిపై దిమ్మెను ఢీకొని బోల్తా పడిన ప్రమాదంలో ముప్పవరం గ్రామానికి చెందిన కూలీ మేస్త్రీ షేక్ అషీర్ బీ (60) అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మండల పరిధిలోని అలవలపాడు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. ప్రతి రోజు ముప్పవరం నుంచి మిరపకాయలు కోసేందుకు కూలీలు రావినూతల గ్రామం వెళుతుంటారు. బుధవారం ఆటోలో పది మంది బయలు దేరారు. కొండమంజులూరు గ్రామానికి చెందిన సందోలు ఇమ్మానియేలు ఆటో నడిపాడు. జాతీయ రహదారిపై అలవలపాడు అడ్డరోడ్డు దగ్గరకు వచ్చేసరికి రోడ్డుకు అడ్డంగా సిమెంట్ దిమ్మె ఉంది. గత రాత్రి ఒక లారీ సిమెంట్ దిమ్మెను గుద్దటంతో అది రోడ్డు మధ్యలో వచ్చి పడింది. ఆటో డ్రైవర్ అది గమనించకపోవడంతో నేరుగా వెళ్లి దిమ్మను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలను పనికి తీసుకెళ్లే మేస్త్రీ షేక్ అషీర్ బీ అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న దాసరి పుష్పాలు, కొమ్ము పాపమ్మ, చింతల లక్ష్మి, వలపర్ల భారతీలకు గాయాలు అయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ ఇమ్మానియేలుకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో గుంటూరు వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. రేణింగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్చి 27 నుంచి ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

గుంటూరు రూరల్: మార్చి 27 నుంచి మూడు రోజులపాటు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదర్శనలో దక్షిణ భారతదేశ రాష్ట్రాల నుంచి రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, పాల్గొంటారని పేర్కొన్నారు. 300 వరకూ స్టాల్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చీరాల రైల్వేస్టేషన్ వద్ద గల ఫైరాఫీసు గేటు సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు... రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ఎస్సై పరిశీలించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుని వయస్సు 50 – 55 సంవత్సరాలు ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు, మెడమీద పుట్టుమచ్చ, కుడికాలు తొడమీద మరో పుట్టుమచ్చ ఉన్నట్లు చెప్పారు. శరీరంపై ఎరుపురంగుపై తెల్ల పెద్దగడులు గల నిండు చేతులు చొక్కా, డార్క్ రంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.



మరో ప్రమాదంలో ...

రైలు ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చీరాల–వెదుళ్లపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్. కొండయ్య తెలిపిన వివరాల మేరకు... రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడనే సమచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించగా మృతుని వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని చెప్పారు. మృతుని వయస్సు 50 – 55 సంవత్సరాలు ఉంటాయని, 5.6 ఎత్తు, ఛామన ఛాయ రంగు కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుని శరీరంపై వంకాయ రంగు, తెలుపు నలుపు గడులు కలిగిన చొక్కా, సిమెంట్ కలర్ జీన్స్‌ప్యాంటు ఉన్నట్లు వివరించారు. మృతుని మెడలో నలుపు, ఎరుపు కలిగిన పూసల దండ ఉందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ముగిసిన అంతర కళాశాలల సాఫ్ట్‌బాల్ టోర్నీ

– విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకున్న . ధనలక్ష్మి కాలేజీ జట్టు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడలతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక దృఢత్వం సిద్ధిస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్ బాల్ (మెన్) టోర్నమెంట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటాపోటీగా సాగిన టోర్నమెంట్‌లో ధనలక్ష్మి కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు మొదటి స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కై వసం చేసుకుంది. ఎమ్‌ఎల్ఎస్ డిగ్రీ కాలేజీ జట్టు రెండొవ స్థానంలో నిలిచి రన్నర్ ట్రోఫీని సాధించింది. తృతీయ స్థానంలో ఏఎన్‌యూ ఫిజికల్ కళాశాల జట్టు నిలవగా, నాలుగవ స్థానంలో ఆర్‌వీఆర్‌జేసీ జట్టు నిలిచింది. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. టోర్నమెంట్‌లో మెలకువలతో తమ ఉత్తమ నైపుణ్యాన్ని కనబరిచిన క్రీడాకారులతో ఏఎన్‌యూ సాఫ్ట్ బాల్ (మెన్) జట్టును సెలక్షన్ కమిటీ సభ్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పీ గౌరీశంకర్, డాక్టర్ ఎమ్ శివరామకృష్ణ, ఏఎన్‌యూ టోర్నమెంట్ ఆబ్సర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, ఏఎన్‌యూ సెలెక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ పీ శ్రీనివాస్, డాక్టర్ ఎం.బుచ్చిబాబు, డాక్టర్ రాజా మెరిసిన్‌బాబు, జే ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉగాది రోజున గాంధేయ మార్గంలో ధర్నా

- వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయూన్ బాషా
- చంద్రబాబు ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్

నరసరావుపేట: జిల్లాలోని వలంటీర్లంతా ఉగాది రోజున (30వ తేదీ)డిమాండ్ల సాధన కోసం ధర్నాకు సిద్ధం కావాలని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయూన్ బాషా పిలుపు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగను జరుపుకునే ఉత్సాహం, ఆసక్తి, సంతోషం వలంటీర్లకు లేకుండా కూటమి నాయకులు చేశారని విమర్శించారు. గతేడాది ఏప్రిల్ 9న ఉగాది నాడు ఎన్‌డీఏ కూటమి పక్షాన చంద్రబాబు నాయుడు వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవస్థను కొనసాగిస్తామని, ఉద్యోగాలు తీసెయ్యమని హామీ ఇచ్చారని తెలిపారు. జీతాన్ని కూడా రూ.10వేలకు పెంచుతామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. నైపుణ్యాలకు పదును పెట్టి, వర్క్‌ఫ్రం హోం జాబ్ చేసేలాగా అవకాశాలిస్తామని ఆశ చూపించారని తెలిపారు.ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంలో రాగానే దూరం పెట్టారని విమర్శించారు. డిమాండ్ల సాధన కోసం వలంటీర్లంతా గాంధేయ మార్గంలో నిరాహార దీక్షే చేయాలని బాషా పిలుపు ఇచ్చారు.

ఏఎన్‌ఎంల సమస్యలపై డీఎంహెచ్‌ఓకు వినతి



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా గ్రేడ్-3 ఏఎన్‌ఎంలుగా ఉండి ఎంపీహెచ్‌ఏగా ప్రమోషన్ పొందిన ఏఎన్‌ఎంల సమస్యలపై బుధవారం ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు బోడపాటి నాగవర్ధన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. శాంక్షన్ పోస్టు ఉండి, ప్రొజిషన్ ఐడీ లేనివాటికి పీఎఫ్ఎంఎస్ దగ్గర జీతాలు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. కాంట్రాక్టు, యూరోపియన్ ఫండ్‌లో పని చేస్తూ రెగ్యులర్ అయిన ఏఎన్‌ఎంకు సబ్ సెంటర్ ఇవ్వకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని, శాలరీ డ్రాచేసిన చోట కూడా ఖాళీలు చూపించడం వల్ల కొంత మంది ఏఎన్‌ఎంలు ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారు. ఎఫ్ఆర్‌ఎస్‌లో నమోదుకు తగు ఉత్తర్వులు ఇచ్చి మెడికల్ డిపార్టుమెంట్ అటెండెంట్స్‌లో నమోదు చేయాలని కోరారు. సబ్ సెంటర్ బిల్డింగ్ పూర్తిగా శిథిలావస్థవకు చేరి హెచ్‌ఆర్‌ఏ లేనివారికి హెచ్‌ఆర్‌ఏ శాంక్షన్ చేసేవిధంగా చొరవ చూపాలని కోరారు. ఏఎన్‌ఎంల ప్రమోషన్‌లలో మిగిలిపోయిన ఖాళీలను పరిశీలించి ఇతర సిబ్బందికి కూడా ప్రమోషన్ అవకాశం కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ మొహమ్మద్ షరీఫ్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎం.నరేంద్రబాబు, అంజిరెడ్డి, ఎం.శ్రీనివాస్, ఝాన్సిరాణి, ధనలక్ష్మి, మంగా దేవి, నాగవేణి, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.